# ఆశ

శరభేశ్వరాలయం వద్ద లోకల్ బసెక్కి పి జీ. సెంటర్లో దిగింది శివాని కాలేజీలో ఆమెను బ్యూటీ క్వీన్ అంటారంతా.

అప్పుడే హీరో హోండా దిగిన అమరేందర్... అదే ఆవిడ క్లాస్‌మెట్.. కంటబడగానే మనసు చిందరవందరై పోయింది.

కోటీశ్వరుని ఏకైక సంతానం అమరేందర్. వంకీల జుట్టూ, పొడగాటి చేతులూ, పొడగాటి ముక్కూ , వసందైన మీసకట్టూ, ఖరీదైన సూటూ.. గబగబా ఎదురెళ్ళింది.

"హల్లో అమరేందర్!" ఓ చిరునవ్వు పారేసింది.

"నా అందచందాలన్నీ నీవే..." అందామనుకుంది.

కాని అప్పటికే అతడు హలో!" అంటూ ముందుకెళ్ళి స్నేహితుల్లో కలిసిపోయాడు! మనస్సు చివుక్కుమంది.

కింది పెదవి మునిపళ్ళ మధ్య ఇరుక్కుపోయింది. ముంగురుల్ని సర్దుకుంటూ క్లాసు వైపు నడిచింది.

ఏదన్నా రూటు వెతకాలి. అమరేందర్‌కు దగ్గరవాలి. అతని ఎదలో తన ఒంపుసొంపుల విత్తనాలు చల్లి ప్రేమ పంట పండించాలి. కోటీశ్వరుని కోడలినైపోవాలి... స్వర్గసుఖాలనుభవించాలి... ఊహల ఊసులు... ఉడుం పట్టు పట్టుమన్నాయి.

అదే రోజు సాయంత్రం అమరేందర్ గదిలో ఒంటరిగా ప్రత్యక్షమైంది. నవ్వుతూ పలుకరించింది. లోకాభిరామాయణం తర్వాత జోకభిరామయణం లోకి దింపాలనుకుంది. కానీ ఇప్పుడే అన్నీ ఒలకబోస్తే బావుండదనిపించింది

మరో రోజెళ్ళి బోలెడన్ని జోకులు జోకేసి నవ్వించింది. మాటల్లో మ్యాజిక్ చూపించింది. పగలపడి నవ్వారిద్దరూ నెలరోజుల్లో చేతిలో చెయ్యేసి నడిచింది. విజయం చేరువలో ఉందనుకుంది

"రోజూ సాయంత్రం అలస్యంగా వస్తున్నావేమిటీ!" ముక్కుమీద వేలెసుకొని మందలించిందోసారి తల్లి.

"మాది చాల ఎద్ద కోర్సమ్మా. రోజూ ప్రైవేట్ క్లాసులే. నేనేం చేయాలీ?" కొట్టిపారేసింది.

ఓ రోజు కోమటిచెరువు గట్టుమీద జంటగా నడిచింది. అతని భుజాలమీద చేతులేసి....

"నన్ను మీ ఊరు తీసుకెళ్ళవా అమర్?" అడిగింది కలువ కళ్ళను కమ్మగా తిప్పుతూ.

"తప్పకుండా... రేపే వెళ్తాం నాబండిమీద." అనేశాడు శివాని గుండెల్లో శివరంజని పలికింది.

అనుకున్నట్టుగానే మర్నాడు హీరో హోండా మీద ప్రయాణం. అరగంటలో ఊరొచ్చింది. హీరోహోండా హీరో - హీరోహిన్‌లను మెస్తున్న పుష్పకవిమానంలాగన్పించిదామెకు మనసు మబ్బుల్లో తేలి ఆడింది.

అమరేందర్ ఇల్లు. మూడంతస్తుల బంగళా అమరపురిలాగుంది. రాజసంఉట్టిపడుతోంది చేతిలో చెయ్యేసి వెంట నడిచింది. అమరేందర్ తల్లిదండ్రులు ఎదురొచ్చారు నవ్వుతూ...

"ఈ అమ్మాయెవరూ!" అడిగింది తల్లి. తండ్రి అత్రంగా. కళ్లనిండా ఆసక్తి. కడుపులో అయోమయం.

శివాని గుండెపొరల్లో సంతోష తరంగాలు.

"ఈమె పేరు శివాని. నా క్లాస్‌మేటు. చాలా మంచిపిల్ల. చలాకీగా ఉంటుంది. అందరితో కలుపుగోలుగా ఉంటుంది" పరిచయం చేశాడు.

"మరి ." ఏదో అనబోయాడు తండ్రి

"ఈమె నాకు చాలా దగ్గరైంది నాన్నా!"

"అం .. టే.. .!"

"ఈ శివాని నాకు దేవుడిచ్చిన చెల్లెలు నాకు అక్కా చెల్లెళ్ళు లేరుగదా కదా శివానీ!" శివాని కళ్ళలోకి చూశాడు. ఎయిర్ బస్‌లో ప్రయాణిస్తూ ఎడారిలో పడిపోయినట్టనిపించింది శివానికి. చటుక్కున పక్కకు జరిగింది. పెదాలమీద బలవంతపు చిరునవ్వు మెరిసింది

"ఈ రోజు రాఖీ పూర్ణమ కదూ. రాఖీ కట్టించుకోవాలని తీసుకొచ్చావా! రామ్మా!" అప్యాయంగా భజం తట్టింది తల్లి.

(అమృత్ కిరణ్ - 16-10-1995)

